# అత్తా ఒకింటి కోడలే!

"గూడూరు - మద్రాస్, ఆ పై అన్ని స్టేషనులకు" అని వ్రాసివున్న కౌంటర్ దగ్గర నుంచుని వున్నాడు నాగశంకర్రావ్. అతని ముందు క్యూలో పదిహేను మంది వున్నారు. అంటే అతను, ఆ క్యూ సరిగ్గా నడిస్తే పదహారోవాడన్న మాట.

సమయం ప్రొద్దున తొమ్మిది గంటల అయిదు నిమిషాలయింది.

ఆ గడియారం క్రిందనే, గోడమీద "రిజర్వేషను ప్రొద్దున తొమ్మిది గంటల నించి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండు గంటల నించి అయిదున్నర వరకు" అని వ్రాసి వుంది.

నాగశంకర్రావ్ ముందు నుంచున్న ఒక పట్టాభి అన్నాడు "చూడండి సార్ - తొమ్మిది గంటలకు, కౌంటర్, ఓపెన్ చేస్తారని - వ్రాశారు కానీ ఇప్పటి దాకా ఎవరూ రాలేదు!"

నాగశంకర్రావ్ అన్నాడు "శెలవు రోజు అయినా ప్రొద్దునే లేచి, ఎనిమిదన్నరకల్లా వచ్చి క్యూలో నుంచున్న దెందుకండీ - వీడు టైముకి కౌంటర్ తెరుస్తాడనేగా!"

ఇంతలో కిటికీ వెనకాల చప్పుడయింది. "ఆఁ! వచ్చాడు సార్!" అన్నారెవరో. క్యూలో నుంచున్న వాళ్లకి కౌంటర్ దగ్గర వున్న టింటెడ్ గ్లాస్ లోనించి, అవతల మనిషి వచ్చినట్టు

తెలుస్తున్నది.

తర్వాత అయిదు నిమిషాలు గడిచాయి.

"లోపలేం చేస్తున్నాడు సార్ గురుడు - యింకా పూర్తిగా నిద్ర మేలుకువరాలేదా!". అన్నాడు పట్టాభి.

"వచ్చి వుండదు!" అనబోయిన నాగశంకర్రావ్ ఆగిపోయాడు, కౌంటర్ తలుపు భళ్లున తెరుచుకోవటం చూసి.

క్యూలో కొంచెం కలకలం చెలరేగింది. పట్టాభి అన్నాడు "మీరు నుంచోండి సార్" నేను వెళ్లి రెండు రిజర్వేషన్ ఫామ్స్ తెస్తాను!" అంటూనే క్యూ వదిలి కౌంటర్ దగ్గరకు వెళ్లాడు పట్టాభి.

జబర్దస్తీగావచ్చి క్యూలో ముందు చేరబోతున్న సిల్కులాల్చీ - ఖద్దరు పంచెను, వెనక్కిపంపిస్తున్నాడు క్యూలో ఆరోవాడుగా నుంచున్న ఒక కళ్ళ జోడు చిన్నవాడు.

"పెద్ద మనుషులు మీరే యిలా చేస్తే ఎలాగండీ!" అంటున్నాడు ఆయన తర్వాత నుంచున్న గడ్డంగారు.

పట్టాభి అందించిన ఫామ్ తీసుకుని పూర్తి చేశాడు నాగశంకర్రావ్ - రెండు బెర్తులు త్రివేండ్రంకి కావాలని.

"యింకా మొదలు పెట్టడేమిటి?" అన్నాడు తొమ్మిదిన్నర చూపిస్తున్న గడియారాన్ని చూస్తూ పట్టాభి.

"మాస్టారూ - మీ పెన్నోసారి యిస్తారా!" నాగశంకర్రావ్ వెనుక నుంచున్న బుర్రమీసాల మిలటరీ ఆయన అడుగుతున్నాడు.

పెన్‌కాప్ తన దగ్గరే వుంచుకుని, పెన్ను మాత్రం యిచ్చాడు రావ్.

"అఁ! గురుడు రిజర్వేషన్లు మొదలు పెట్టాడండోయ్!" దాదాపుగా అరచినంత పని చేశాడు పట్టాభి.

"గూడూరు, మద్రాస్, ఆ పై అన్ని స్టేషన్లకు రిజర్వేషన్లు, ఈ రోజు ముప్పయి అయిదు నిమిషములు ఆలస్యముగా మొదలు పెట్టడమైనది" అని ఎనౌన్స్ చేశాడు కళ్లజోడు చిన్నవాడు.

గడ్డంగారు ఫెళ్లున నవ్వాడు. చిరునవ్వైతే గడ్డంలోంచి సరిగ్గా కనబడదని కాబోలు.

మొదటి వ్యక్తి రిజర్వేషన్‌కి సరిగ్గా యిరవయి నిమిషాలు పట్టింది.

రెండవ ఆయన ఫాం అందించాడు.

"మీరు అడిగిన రూట్‌కి యివ్వటానికి కుదరదండీ. మీ కన్సెషన్ ఫాం మీద వయా రేణిగుంట అని లేదు" ఫాం తిరిగి యిచ్చేశాడు రిజర్వేషన్ క్లర్క్ చిదానందం.

"అదేమిటి సార్.... దాని మీద వుండాలే...." అంటున్నాడాయన. వీళ్లిద్దరి మధ్య వాదన పదిహేను నిమిషాలు జరిగింది.

"ఇలా అయితే క్యూ ఎప్పటికి కదులుతుందండీ - పోనీ ఆ ట్రెయిన్‌కి కుదరకపోతే, యింకోదానికే యివ్వరాదూ ..." విసుక్కుంటున్నాడు మిలటరీ ఆయన.

విసుక్కోటం అవగానే నాగశంకరవ్‌కి పెన్ తిరిగి యిచ్చేశాడు.

యింకో పది నిమిషాలు వాదన అయింది. పదో నిమిషం అవుతుండగానే చిదానందం, చేతిలో కాగితాలు తీసుకుని, కౌంటర్ వదిలి, లోపలకు పోయాడు.

"గోవిందా - యిక అయినట్టే యివాళ!" అన్నాడు కళ్లజోడు చిన్నవాడు.

"బొత్తిగా డిసిప్లిన్ పోయిందండీ ప్రభుత్వరంగంలో ..." అంటున్నాడు మిలటరీ ఆయన.

కొంచెం సేపయిన తర్వాత తిరిగివచ్చాడు చిదానందం. కాగితాలు అన్నీ తిరిగి యిచ్చేశాడు.

"లాభం లేదండీ - కన్సెషన్ లేకాండా అయితే మీరు అడిగిన రూట్‌లో టిక్కెట్టు, యిస్తాను--"

"అదెలాగ - నేను ప్రొద్దున్నేవచ్చి నుంచున్నాను!"

"నేను కాదనటం లేదండీ - మీరు రాత్రే వచ్చి వుండవచ్చు - కానీ మీకు అలా టిక్కెట్టు యివ్వటానికి మా రూల్స్ ఒప్పుకోవు".

"ఆ రూల్సేమిటో నాకూ తెలుపండి... వూరికే..." వాగ్యుద్ధం మళ్లీ మొదలయింది అక్కడ.

చిదానందం విసుగ్గా అన్నాడు "వెళ్ళి కమర్షియల్ సూపరింటెంట్‌ను కలవండి - ఈ విషయంలో నేనేం చేయలేను".

అతను చిదానందాన్ని సూటిగా చూసి, కోపంగా విసురుగా వెళ్ళి పోయాడు.

క్యూలోని మూడో అతను ఫాం అందించాడు.

నాగశంకర్రావ్ టైమ్ చూశాడు - పదీ యాభయి అయింది.

మూడో అతని పని జరుగుతున్నది. అంటే తనకి మోక్షం యింక ఎప్పుడు వస్తుందో.

మూడో అతను పది నిమిషాల్లో టిక్కెట్టు తీసుకుని వెళ్ళిపోయాడు.

నాలుగో అతను ఫాం అందించాడు.

చిదానందం, అది తీసుకుని, పుస్తకం క్రింద దాన్ని వుంచి, ఒళ్లు విరుచుకున్నాడు.

మూడుసార్లు వెనక్కి తిరిగి చూశాడు.

నాగుగోసారి తిరిగి బోతుండగా వచ్చాడు రైల్వే కాంటీన్ సర్వర్ కాఫీ కప్పుతో.

కాఫీ నోటి దగ్గర పెట్టుకుని అన్నాడు చిదానందం "ఈ వాళ మరీ యింత వేడిగా వుందేమోయ్ కాఫీ"--

సర్వర్ అన్నాడు "నిన్న మరీ చల్లగా వుందన్నారు కదాసార్!"

"అందుకని ఇవాళ నా నాలిక చుర్రుమని పించావ్" నెమ్మదిగా వూదుకుంటూ

తాగుతున్నాడు చిదానందం.

గడ్డంగారికి కాళ్లు పీకుతున్నాయి, దూరంగా వున్న సిమెంటు బెంచీ మీద కూర్చుందామని వుంది కానీ, వెడితే క్యూలో తన స్థానం పోతుంది. అందుకని, ఒకసారి గడ్డం దువ్వుకుని, అలానే నుంచున్నాడు.

"వై దిస్ క్యూ ఈజ్ నాట్ మువింగ్" అడిగాడు మిలటరీ ఆయన.

"ఇద్దరికి టిక్కెట్లు యిచ్చేసరికి అలసి పోయారు బుకింగ్ క్లర్కుగారు. అందుకని హార్లిక్స్ తాగుతున్నారు. అదవగానే టిక్కెట్లు యిస్తారు. దెన్ దిస్ క్యూ విల్ మువ్ విత్ మోర్ ఎనర్జీ" అన్నాడు పట్టాభి.

కళ్ళజోడు చిన్నవాడు వెనక్కి తిరిగి నవ్వాడు- "అధిక శక్తితో ఈ క్యూ కదలుతుందని నేను అనుకోను - ఎందుకంటే ఆయన తాగేది హార్లిక్స్ కాదు - కాఫీ - చికోరి బ్లెండెడ్ కాఫీ'
'

నాగశంకర్రావ్ విసుక్కున్నాడు - అవుతున్న ఆలస్యానికి తోడు, ఈ జోకులతో నా ఖర్మ యిలా కాలిందిగదా అని విచారించాడు కూడాను.

కొంచెం దూరంగా హోల్డాలు మీద వెనక్కి తిరిగి కూర్చున్న ఆ యువతి, ఒంపుసొంపులు, నాగశంకర్రావ్ దృష్టి నాకర్షించాయి - ఆమె తొడుక్కున్న జాకెట్ ఆమె తెల్లటి, నున్నటి మెడనీ, వీపులో చాల భాగాన్నీ, నడుముని పూర్తిగా చూపిస్తూ - విసుక్కుంటూ క్యూలో నుంచున్నవాళ్ళకు కాలక్షేపా'న్నీ కలగచేస్తున్నది.

ఎప్పుడూ రిజర్వేషన్ కౌంటర్ మీదే దృష్టిని కేంద్రీకరిస్తే, తనకు విసుగు పెరగటమే కాక, కాళ్ళ నొప్పులు కూడా తెలుస్తాయి కనుక నా.శం.రావ్ తన దృష్టిని ఆమె వీపు మీద వున్న నల్లటి చిన్న పుట్టుమచ్చ మీదా, ఆ పుట్టుమచ్చ చుట్టూ వున్న నున్నటి మెరిసే శరీరం మీదా కేంద్రీకరించాడు.

నెమ్మదిగా కాఫీ తాగి, సిగరెట్టు అంటించి మళ్లీ పని మొదల పెట్టాడు చిదానందం.

సమయం సరిగ్గా పన్నెండు గంటలయింది. అప్పుడే ఒక సర్దార్జీ వచ్చి ఆమెతో ఏదో చెప్పాడు. ఆమె లేచి నిలబడింది. పొడుగ్గా, బలంగా పిట పిట లాడుతోంది.

సర్దార్జీ చటుక్కున, హోల్డాల్ని అందుకుని భుజాన వేసుకుని ముందుకు నడిచాడు. ఆమె అతని వెనకే నడుస్తూ లోపలికి ప్లాట్‌ఫాం మీదకి వెళ్ళి పోయింది.

నా.శం.రావ్ నిట్టూరుద్దామనుకునే సరికే, ప్రక్కనున్న పట్టాభి నిట్టూర్చేశాడు.

వెనకనున్న మిలటరీ ఆయన కూడా గంభీరంగా నిట్టూర్చాడు.

నా.శం.రావ్ కూడా ఆ పని చేసి, ముందుకు కౌంటర్ వేపు చూశాడు.

కళ్ళజోడు చిన్నవాడు టిక్కెట్టు తీసుకుంటున్నాడు. అంటే క్యూలో వున్న ఆరోవాడు. తమ పదహారో వాడు తనకి ఒంటి గంట లోపల టికెట్టు దొరక్కపోతే, మళ్ళీ మధ్యాహ్నం వచ్చి క్యూలో నుంచోవాలి.

నా.శం.రావ్ విసుక్కుందామనుకునేసరికే, ప్రక్కనున్న పట్టాభి విసుక్కున్నాడు.

క్యూ నెమ్మదిగా కదులుతున్నది.

సమయం పన్నెండు గంటల ఏభయి నిమిషాలు. నాగశంకర్రావ్ ముందు ఇద్దరు, వెనక్కి పాతిక మంది వున్నారు.

"ఇంత మంది జనం వున్నారు కదా - వీళ్ళు వేరే వేరే కౌంటర్లు ఎందుకు పెట్టరు - అంతా యిల్ ప్లానింగ్" కోపంగా అన్నాడు మిలటరీ ఆయన.

సమయం పన్నెండు గంటలు ఏభయి ఆరు నిమిషాలు. పట్టాభి టికెట్ తీసుకుని వెళ్ళిపోయాడు.

నాగశంకర్రావ్ కౌంటర్లో నించి చేయి లోపలకు పెట్టాడు. బుకింగ్ క్లర్క్ చిదానందం ఫాం అందుకునేలోగానే, లోపలకు ఎవరో వచ్చారు.

"ఒరేయ్ - సుబ్బారావ్, కాముడూ కూడా వస్తామన్నారు. ఇవాళ సెకండ్ షోకే - మన పెద్ద బాస్ వేసిన సినిమా -నువ్వు కూడా రావాలి" అన్నాడు చిదానందంతో అతను.

"మొదటి రోజే ఎందుకురా - అవస్థ పడాలి" అన్నాడు చిదానందం.

సమయం పన్నెండు గంటలు ఏభయి ఎనిమిది నిమిషాలు.

"అదే - మన పెద్ద బాస్ హీరోరా ఈ పిక్చర్‌లో - మొదటి రోజు వెళ్ళకపోతే ఎలా...'
'

"బాగా రష్‌గా వుంటుందేమోరా!" అన్నాడు చిదానందం.

"నీ కెందుకు - నువ్వు మీ యింట్లో రాత్రి ఎనిమిదిన్నరకల్లా రెడీగా వుండు - నేనూ సుబ్బడూ, కాముడూ వచ్చేస్తాం!"

సమయం పన్నెండు గంటలు ఏభయి తొమ్మిది నిమిషాలు.

నాగశంక్రరావ్ ఏదో అనబోయాడు.

"పద పోదాం - టైమయింది" అన్నాడు అతను.

నాగశంకర్ రావ్ ముఖం మీదే కౌంటర్ తలుపు దభేల్‌మని మూసుకుంది.

ఒక్క నిమిషం నోట మాట రాలేదు నాగశంకరర్రావ్‌కి.

గోడ మీద గడియారం ఒంటి గంట కొట్టింది, లంచ్‌కి టైమయింది అన్నట్టుగా.

కడుపులో మంటగా వుంది నాగశంకర్రావ్‌కి.

కోపం తారాస్థాయికి చేరుకుంది. కానీ, మూసుకున్న కౌంటర్ తలుపు మీద చూపించాల్సిందే తన కోపం.

మిలటరీ ఆయన అంటున్నాడు "రెండు గంటలదాకా ఇక కౌంటర్ తెరవరు - పదండి - అలా వెళ్ళి కాఫీ అయినా తాగుదాం".

మిలటరీ ఆయనకి మీసాలే కానీ కోపం లేదు కాబోలు అనుకుని, ఆయనతో బయల్దేరాడు నాగశంకర్రావ్.

"పది నిముషాలు ఆలస్యంగా వచ్చాడు బుకింగ్ క్లర్క్ - అయిదు నిమిషాలు ముందే

పని మానేశాడు. మధ్యలో కూడా విపరీతమైన ఆలస్యం. వీళ్ళని అడిగేవాళ్ళు లేరుసార్ - ఛీ-ఛీ- యిలా అయితే మన దేశం..." అంటున్నాడు నాగశంకర్రావ్.

ఫెళ్ళున నవ్వాడు మిలటరీ ఆయన. నవ్వటం అయిన తర్వాత వేరే ఏ స్టేట్ మెంటూ ఇవ్వలేదు.

కాఫీ తాగి ఒకటిన్నరకే వచ్చేశారు యిద్దరూ.

కౌంటర్ ముందు యింకా క్యూ వుంది. దాదాపు పదిహేను మంది నుంచుని వున్నారు క్యూలో.

నాగశంకర్రావ్ ముందుకు వెళ్ళబోయాడు. క్యూలో ముందున్నవాళ్ళు అరిచారు, అతన్ని వెనక్కివచ్చి క్యూలో నుంచోమని.

బిత్తరపోయారు, రావ్, మిలటరీ ఆయనా.

"మేము యిక్కడే వున్నాం - ఇందాకటి దాకా - లంచ్‌కి ముందు నా దగ్గరే బుకింగ్ క్లోజయింది". యింకా అంటున్నాడు నా.శం.రావ్.

"నిన్న నాకూ అలానే అయిందిసార్ - అయితే నేనూ ముందుకు రానా..." అడిగాడు క్యూలో పదిహేనో అతను.

అందరూ ఒక్కసారిగా నవ్వారు.

బారుగడ్డం వున్న ఆయన నెమ్మదిగా అన్నాడు "మేము లంచ్‌కి కూడా వెళ్ళకుండా యిక్కడే నుంచున్నాం సార్ - ఎందుకని? క్యూలో సీటు పోతుందని -వెళ్ళి వెనక నుంచోండి సార్ - లేకపోతే ఈ లోగా క్యూ యింకా పెరిగిపోతుంది".

క్యూలో ఈ సారి కూడా నాగశంకర్రావ్ పదహారోవాడు. అతని వెనకాల మిలటరీ ఆయన నుంచుని వున్నాడు.

సమయం రెండు గంటలు పది నిముషాలు. కౌంటర్ తలుపు యింకా తెరుచుకోలేదు.

మరి నాగశంకర్రావ్‌కి టిక్కెట్టు ఎన్నింటికి దొరికింది? ఆ రోజు రిజర్వేషన్ చేయించ గలిగాడా? అన్న ప్రశ్నలు అడక్కండి - మనం కథని యిక్కడో మలుపు తిప్పి ఆ రోజు రాత్రి బుకింగ్ క్లర్క్ చిదానందం ఏం చేశాడో చూద్దాం.

సమయం రాత్రి తొమ్మిది గంటలు పదిహేను నిమిషాలు.

చిదంబరం, అతని వెనక అప్పారావ్, సుబ్బారావు, కాముడూ నుంచుని వున్నారు. ఎక్కడా?

"ఆ సినిమా హాల్లో ఆ రోజే 'పెద్ద బాస్' హీరోగా నటించిన అద్భుత సెంటిమెంటల్ కుటుంబ గాథా చిత్రం విడుదల. అభిమానులు - అభిమానంతోనూ, దురభిమానులు, దురభిమానంతోనూ ఆ సినిమా చూట్టానికి వందల్లో, కాదు వేలల్లో వచ్చారు.

చిత్రం విడుదల కావటానికి ముందే, విడుదలయి వేలలో రికార్డులు అమ్ముడుపోయిన కైపు పాట "నా కెక్కడో దురదగా వుంది మావా" సినిమాలో చూట్టం కోసం, వచ్చిన జనమంతా కుమ్ముకుంటున్నారు టిక్కెట్ల కోసం.

"తొమ్మిదిన్నరకి సినిమా అయితే - తొమ్మిదింబావుకి కూడా బుకింగ్ తెరవక పోతే ఎలాగరా" అన్నాడు చిదానందం.

అన్నది ఎవరు? - చిదానందం!

"కనీసం డ్రెస్ సర్కిల్ యివ్వవచ్చు కదా - నేల వాళ్ళకి ఆలస్యంగా యిచ్చినా పరవాలేదు కానీ..." అంటున్నాడు సుబ్బారావ్.

చిదానందం పోలీసులు కాపలా కాస్తున్న ఆ క్యూలో పదహారోవాడు, తర్వాత మిగతా మిత్ర బృందం.

"గంట అయింది మనం క్యూలో నిలబడి - అందరం ఎందుకు నుంచోటం యిక్కడ - ఎవడో ఒకడు నుంచుంటే పోలా!" అన్నాడు అప్పారావ్.

"నోనో -- మనిషికి ఒక్క టిక్కెట్టు మాత్రమే యివ్వబడును - అది రూల్" అన్నాడు కాముడు.

"జనాన్ని యిబ్బంది పెట్టటానికే ఈ రూల్సన్నీ - టిక్కెట్టు యివ్వటం కూడా చేతకాదు - నో బ్రయిన్స్" అన్నాడు ఎవరు? - చిదానందం!

సమయం తొమ్మిది ఇరవయి అయిదు.

"ఏమిటి గురూ ఆలస్యం - బుకింగ్ తొమ్మిదింటికే తెరుస్తాడని వ్రాశారు. ఇంకా టిక్కెట్టు యివ్వడేమిటి? ఏమిటీ గురుడి వుద్దేశ్యం" అన్నాడు అప్పారావ్.

"టైమ్ సెన్స్ లేదురా మన ఇండియన్స్‌లో.... లేజీ ఫెలోస్" అంటున్నాడు.... చిదానందం.

కౌంటర్ తలుపు భళ్లున తెరుచుకుంది.

క్యూ అటూ యిటూ గబగబా కదిలి పోలీసులను చూసి, సర్దుకుంది.

లోపల వినిపిస్తున్న పాటలు, ఆగిపోయాయి.

"అత్యధిక నురుగుని యిచ్చి, మీ బట్టలను తెల్లగా..." లోపల నుంచి వినిపిస్తున్నది.

"ఒరేయ్ - వీడప్పుడే మొదలు పెట్టేశాడ్రా. నేను ప్రతి సినిమానీ సర్ఫ్‌నించీ శుభం దాకా చూడాల్సిందే - అది నా నియమం" అంటున్నాడు చిదానందం.

క్యూలో పదహారోవాడయిన చిదానందం, పన్నెండోవాడయాడు.

ఈలోగా అప్పారావ్ పర్స్ కొట్టేశాడెవడో.

"పోనీలే - నీ పర్స్‌లో వుండేది ఎప్పుడూ ముప్పయి పైసలేగా - నే యిస్తాలే", అభయం యిచ్చాడు కాముడు.

"మన పెద్ద బాస్, సినిమాలో రీలుకో త్యాగం చేస్తున్నప్పుడు నువ్వా మాత్రం త్యాగం చేయలేవురా!" అన్నాడు సుబ్బారావ్.

"మీకూ టింకూలాటి బాబు వుంటే..." లోపల నించి వినబడుతున్నది.

చిదానందం విసుక్కుంటున్నాడు.

"అయిపోయింది. నీ ముందు ముగ్గురే కదురా వున్నది".

"రొంపా, తుమ్ముల సత్వర నివారణ కోసం..." లోపల నించి తుమ్ములు కూడా వినబడుతున్నాయి.

చిదానందం ముందు ఇక ఒక్క మనిషే వున్నాడు.

"పది పైసలు యివ్వలేదు మీరు!" అంటున్నాడు అతను.

"చిల్లర వుంటే యివ్వనా - లేదయ్యా"

"మీ సంగతి నాకు తెలీదా - ప్రతి టిక్కెట్టు మీదా పది పైసలు కొట్టేసి..."

"సరిగ్గా మాట్లాడండి. మీ పది పైసల కోసం మేం యిక్కడ ముష్టి వాళ్ళలా కాచుక్కూర్చోలేదు..."

"ఆంధ్రప్రదేశ్‌లో తుపాను బాధితుల కోసం..." లోపల నించి వినబడుతున్నది.

"ఒరేయ్ న్యూస్‌రీల్ కూడా అయిపోతున్నదిరా!" చిదానందం అరిచాడు.

"మాష్టారూ - ఆ పది పైసలు నేనిస్తాను - మీరు వెళ్ళండి బాబూ - మేం టిక్కెట్లు తీసుకోవాలి" అంటున్నాడు కాముడు.

"మీ డబ్బులు నా కెందుకు సార్ - పది పైసలు లెక్క కాదు అసలు..."

"అయితే మీరు కదలండి మరి..." కాముడు ఆయన్ని అక్కడ్నించి పంపించాడు.

లోపలనించి టైటిల్స్ తాలుకు సంగీతం వినపడుతున్నది.

"టైటిల్స్ వేస్తున్నార్రోయ్" అని అరచి, కౌంటర్లో చేయి పెట్టబోయిన చిదానందం ఆగిపోయాడు.

కౌంటర్ తలుపు ఫెడేల్‌మని మూసుకుంది. ఎవరో వచ్చి కౌంటర్ ముందు "హౌస్‌ఫుల్' అని బోర్డు తగిలించి పోయాడు.

ఒక క్షణం నోట మాట రాలేదు చిదానందానికి.

"ఇదేమిట్రా - నువ్వు పదహారోవాడివి కదూ - పదిహేను టిక్కెట్లు మాత్రమే యిచ్చి కౌంటర్ మూసేశాడేమిటి?" అడిగాడు కాముడు.

"అదంతే ఈ హాల్లో ఎప్పుడూ - పదిహేను తెల్ల టిక్కెట్లు యిచ్చాడివాళ" అన్నాడు సుబ్బారావ్.

లోపల నించి సినిమా తాలుకు మాటలు కూడా వినిపిస్తున్నాయి.

"అత్తయ్యా! ప్రతి అత్తా ఏదో ఒక యింటికి కోడలే అని గుర్తుంచుకోండి!" అంటున్నది ఒక కోడలు.

"పదండిసార్... పదండి... టిక్కెట్లయి పోయాయి..." అక్కడ నుంచున్న అందర్నీ బయటకు పంపిస్తున్నాడు గేట్‌కీపర్.